క్లుప్తంగా

ఎండాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న సీడీపీఓ రేవతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కె.రేవతి మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో తెరవాలని, కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఎండాకాలంలో వడదెబ్బలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్‌వాడీ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అశోక్ కుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెంచిన టెట్ ఫీజు తగ్గించాలి

జూలూరుపాడు: పెంచిన టెట్ పరీక్ష ఫీజును తక్షణమే తగ్గించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. టెట్ పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై పెనుభారం పడుతుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రవేశ పరీక్షల ఫీజులు తగ్గించి తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందని, ఎన్నికల హామీకి విరుద్ధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న నాయకులు

సుజాతనగర్: సీతంపేట బంజర గ్రామంలో శ్రీ జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో గురువారం జరిగిన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. పూజల్లో బీఆర్‌ఎస్ నాయకుడు కోనేరు చిన్ని(సత్యనారాయణ) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్యా మంగమ్మ, సత్యనారాయణ, గోపీ, రావి రాంబాబు, మత్రు, గుగులోత్ రాందాస్, హరిదాస్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



శిశివుతో ఈఎంటీ రాధ, ఆశా వర్కర్ మంగ

టేకులపల్లి: బద్దు తండాకు చెందిన డి.అలివేలు పురిటి నొప్పులతో బాధపడుతుండగా భర్త శ్రీనివాసరావు 108కి సమాచారం అందించారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన 108 చేరుకొని ఆమెను సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే క్రమంలో మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాధ, ఆశా వర్కర్ మంగ సాయంతో ప్రసవం చేశారు. మగబిడ్డ జన్మించాడు. తరువాత సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

చెక్ పోస్ట్ వద్ద తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇల్లెందు నియోజకవర్గం సరిహద్దులోని చెక్ పోస్టుల వద్ద పోలీసుల వరుస తనిఖీలు చేస్తున్నారు. డీఎస్పీ ఎస్.చంద్రభాను ఆధ్వర్యంలో గురువారం లలితాపురం చెక్ పోస్టు వద్ద తనిఖీ నిర్వహించారు. ఇల్లెందు నియోజకవర్గానికి ఖమ్మం వైపు లలితాపురం వద్ద, కొత్తగూడెం వైపుకు మోదుగులగూడెం వద్ద, మహబూబాబాద్‌కు నెహ్రూనగర్ వద్ద, గుండాల–పాఖాల కొత్తగూడెం వైపుకు రొంపేడులో వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయగా ప్రతీరోజు తనిఖీలను ముమ్మరం చేశారు. వచ్చిపోయే వాహనాలను చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్తుంటే చెక్ పోస్టులో తనిఖీలో సీజ్ చేస్తారని తెలిపారు.

అడ్డగోలుగా ఆక్రమణలు

- పాల్వంచ సర్వే నంబర్ 817లో ప్రభుత్వ భూములు హాంఫట్
- భై నంబర్ల పేరుతో ఇప్పటికే అక్రమ రిజిస్ట్రేషన్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వివాదంలో ఉన్న భూమిని చదును చేసిన దృశ్యం


పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో అడ్డగోలుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములన్నింటినీ కొల్లగొడుతున్నారు. బై నంబర్ల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు పరంపర కొనసాగుతోంది. గతంలో ప్రభుత్వ భూములని సాక్షాత్తూ రెవెన్యూ యంత్రాంగం పాతిన బోర్డుల్లో నేడు బహుళ అంతస్తు నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరికొన్ని చోట్ల చిన్నచిన్న రేకుల షెడ్లు వేసి ఇంటి నంబర్లు తెచ్చుకుని రికార్డులు పెంచుకుంటున్నారు. కలెక్టరేట్‌కు అతి సమీపంలో పాల్వంచలోని భూములు ఇలా హాంఫట్ అవుతున్నా అడ్డుకునే నాథుడే లేడు. సర్వే నంబర్ 817లో ఈ ఆక్రమణలకు అంతులేకుండా పోతోంది. భూములకు పట్టా పాసుపుస్తకాలు సైతం చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నచందనంగా అమ్మకాలు చేపడుతున్నారు. నాడు రెవెన్యూ అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి ప్రభుత్వ భూములున్న చోట బోర్డులతో పాటు, పోల్స్ పాతి ఫెన్సింగ్ వేశారు. నేడు ఆయా చోట్ల బోర్డులు, ఫెన్సింగ్ కనుమరుగు కాగా, కోర్టు వివాదంలో ఉన్న వాటిలో సైతం నిర్మాణాలు ఊపందుకోవడం గమనార్హం. ఇక మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు నిర్మాణాలు జరుగుతున్నాయి. గతంలో గిరిజనుల పేరుతో ఉన్న పట్టా భూములు సైతం నేడు గిరిజనేతరుల చేతుల్లోకి రావడం గమనార్హం.

వందలాది ఎకరాలు స్వాహా...

పట్టణ విస్తీర్ణంలో సర్వే నంబర్ 817 సగభాగంగా ఉంటుంది. దీనిలో అక్కడక్కడ మాత్రమే పట్టా భూములు ఉండగా మిగతా అంతా ప్రభుత్వ భూమే ఉంటుంది. అయితే ఇది దశాబ్దాల కాలంగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. 817 సర్వే నంబర్ విస్తీర్ణం 2,361 ఎకరాలు, ఇందులో 1958 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీలకు 128.7 ఎకరాల భూమి పంపిణీ పట్టాలు ఇచ్చారు. 1,790 ఎకరాల్లో రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. 85.4 ఎకరాలు మాత్రమే కబ్జా అయిందని, మిగతా భూమి ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ ఎక్కడా ఖాళీ భూమి కనిపించడం లేదు. ఇక రిజర్వ్ ఫారెస్ట్ భూములు సైతం గుట్టపైకి ఎగబాకి ఆక్రమించారు. దీంతో అధికారులు సైతం చేసేది లేక మిన్నకుండిపోతున్నారు. ఇక కొద్దిపాటి భూములు సైతం ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబంధ హస్తాల్లోకి వెళ్లడం గమనార్హం. ముఖ్యంగా శివనగర్, శ్రీనివాసకాలనీ, కుంటినాగుల గూడెం, ములకలపల్లి మండల సరిహద్దు ప్రాంతాల్లో రెవెన్యూ భూములన్నింటికీ పట్టా పాసుపుస్తకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

నాడు రెవెన్యూ బోర్డులు..
నేడు బహుళ అంతస్తులు...

శివనగర్, శ్రీనివాసకాలనీ, కుంటినాగుల గూడెం తదితర ఏరియాల్లో గతంలో పలువురు తహసీల్దార్లు ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. అంతేగాక పోల్స్ పాతి ఫెన్సింగ్ వేశారు. కానీ ఆ బోర్డులను తొలగించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకుని నేడు బహుళ అంతస్తులు నిర్మించారు. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం పొలాలుగా ఉన్న వాటన్నింటినీ వెంచర్లుగా మార్చి గజాల చొప్పున అమ్మేశారు. ములకలపల్లి రోడ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో పలుచోట్ల ఆక్రమణలు జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్, ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించడంతో పాటు, అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



శివనగర్‌లో అధికారులు పెట్టిన బోర్డు (ఫైల్)

చర్యలు తీసుకుంటాం...



సర్వే నంబర్ 817లో ప్రభుత్వ భూములుంటే వాటిని రక్షిస్తాం. ఆక్రమణకు గురైతే రక్షణకు చర్యలు తీసుకుంటాం. గతంలో పెట్టిన బోర్డుల పరిధి నాకు తెలియదు. ఆయా ఏరియాలను పరిశీలిస్తా.

– వివేక్, తహసీల్దార్, పాల్వంచ

సుజాత సేవలు అభినందనీయం



సుజాతను సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ఆకాశవాణి రేడియో కేంద్రంలో ఇంజనీర్ సుజాత సేవలు అభినందనీయమని పలువురు ఆలిండియా రేడియో అధికారులు ప్రశంసించారు. కొత్తగూడెం ఆకాశవాణి రేడియో కేంద్రంలో సీనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న ఆర్.సుజాతకు గురువారం ఉద్యోగ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 30 ఏళ్లుగా ఆల్ ఇండియా రేడియోలో ఇంజనీరింగ్ విభాగంలో పలు ప్రాంతాల్లో పనిచేసి కొత్తగూడెంలో రిటైర్డ్ అవ్వడం అభినందనీయమన్నారు. సుదీర్ఘకాలం పాటు ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో ఆమె అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఆకాశవాణి కేంద్రం అధికారులు బైరి శ్రీనివాసన్, ఎస్ఎస్ రెడ్డి, పి.ప్రభాకర్‌రావు, ఎం.బాబుసింగ్, పి.ఆనందరావు, ఎం.సుమన్, పి.సుదర్శన్, బి.సుగ్రీవ, ఎం.కోటేశ్వరరావు, డి.విజయ్ కుమార్, కొలిపాక శంకర్‌రావు, బొల్లవరపు ప్రసాద్‌రావు, శనగస్వామి, నరసయ్య, రేడియో జాకీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ మండల కార్యదర్శిగా నాగరాజు



నాగరాజుకు నియామకపత్రం అందజేస్తున్న జితేందర్

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శిగా వెంగన్నపాలేనికి చెందిన మాడుగుల నాగరాజు నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు నాగరాజు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

కాంగ్రెస్ సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి దయాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కె.నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొదుమూరి కోటేశ్వరరావు, జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డిలకు నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట పార్లమెంట్‌ను గెలుచుకుందాం

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ న్యూడెమోక్రసీ ఉమ్మడి అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ చిట్టిపాటి వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురళీకృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఇల్లెందులో గౌని అయిలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ప్రసంగించారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశామని, పోడు భూములకు పట్టాలు ఇచ్చే వరకు ఉద్యమించి సఫలీకృతులమయ్యామని గుర్తుచేశారు. పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారంలో ముందున్న న్యూడెమోక్రసీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్న విషయాన్ని ప్రతీ పల్లెలోనూ ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. జె.సీతారామయ్య, రాసుద్దీన్, తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, యదళ్లపల్లి సత్యం, విశ్వనాథం, లక్ష్మీనారాయణ, మోకాళ్ల రమేష్, సంగయ్య, వెంకన్న, ఉమ పాల్గొన్నారు.



న్యూడెమోక్రసీ ఎంపీ అభ్యర్థిని పరిచయం చేస్తున్న సాదినేని వెంకటేశ్వరరావు

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తగూడేనికి చెందిన సీనియర్ న్యాయవాది లక్కినేని సత్యానారాయణ ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో సత్యనారాయణకు 108 ఓట్లు, అనుబ్రోలు రాంప్రసాదరావుకు 102 ఓట్లు వచ్చాయి. శివారెడ్డికి 10, ఎన్వీ రాజేష్‌కు 3 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శి పదవికి ఎమ్మెస్సార్ రవిచంద్రకు 173 ఓట్లు రాగా పి.శ్రీనివాసరావుకు 50 ఓట్లు వచ్చాయి. ఎమ్మెస్సార్ రవిచంద్ర విజేతగా నిలిచారు.

మహిళా రిప్రజెంటెటివ్ పోటీలో నల్లమల్ల ప్రతిభకు 141 ఓట్లు రాగా, ఎస్‌కే షాజాహాన్ పర్వీన్‌కు 78 ఓట్లు వచ్చాయి. 62 ఓట్ల మెజార్టీతో ప్రతిభ గెలుపొందింది. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉపాధ్యక్షుడిగా తోట మల్లేశ్వరావు, సహాయ కార్యదర్శిగా సందుపట్ల ప్రవీణ్, కోశాధికారిగా అరకల కరుణాకర్, లైబ్రరీ సెక్రటరీ గా ఎస్‌కే సాధిక్‌పాషా, ఆటలు సాంస్కృతిక కార్యదర్శిగా దూళిపాల రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పలివేల గణేష్‌బాబు, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులుగా గాదె సునంద, పాండురంగ విఠల్, షేక్ అంకూష్ భాషా వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి జడ్జి పాటిల్ వసంత్ అభినందనలు తెలిపారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన లక్కినేని సత్యానారాయణ, కమిటీ సభ్యులు స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు.

ఇల్లెందు: ఇల్లెందు బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరుగా సాగాయి. గురువారం ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారి మామిడి సత్యప్రకాష్ ప్రారంభించారు. ప్రశాంత వాతావరణంలో సాగిన ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూక్యా రవి కుమార్ నాయక్ ఎన్నికయ్యారు. ఆయన సమీప ప్రత్యర్థి పెద్దూరి నరసయ్యకు 19 ఓట్లు రాగా రవికుమార్ నాయక్‌కు 25 ఓట్లు వచ్చాయి. ఆరు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 51 ఓట్లకు గాను 47 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భూక్యా రవికుమార్ నాయక్ మాట్లాడుతూ... జూనియర్, సీనియర్, మహిళా న్యాయవాదులను కలుపుకుని వెళ్తానని తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. కోర్టులో న్యాయవాదులకు మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ షెడ్డు నిర్మాణం చేయిస్తానని చెప్పారు.

ప్రధాన కార్యదర్శిగా కె.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కీర్తి కార్తీక్, కోషాధికారిగా చినుముల నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్ష స్థానం పెండింగ్‌లో ఉంది.

న్యాయవాదుల గుమస్తాల సంఘం ఎన్నిక

ఇల్లెందు కోర్టులో న్యాయవాద గుమాస్తాల సంఘం ఎన్నికలు నిర్వహించారు. గురువారం కోర్టు ఆవరణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా రాగల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా శివప్రసాద్ పాసీ, జనరల్ సెక్రెటరీగా శ్రీకాంత్ తివారీ, జాయింట్ సెక్రెటరీగా కోటేశ్వరరావు, కోషాధికారిగా జావీద్, గేమ్స్ సెక్రెటరీగా శరత్, గౌరవ సలహాదారుగా ఎల్లయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గిరిధర్ వ్యవహరించారు.



కొత్తగూడెంటౌన్: సంబురాలు జరుపుకుంటున్న బార్ అసోసియేషన్ సభ్యులు



ఇల్లెందు: రవికుమార్ నాయక్‌తో సీనియర్ న్యాయవాదులు

ఆదాయ పన్ను రద్దు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీ ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని గురువారం తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో హైదాబాద్‌లోని కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి సింగరేణి కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ... కార్మికుల సొంతింటి కల, ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వంటి వాటిపై దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా కొత్త గనుల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలని కోరారు. వీటికి సానుకూలంగా స్పందించి ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఉత్పత్తి సాధించినందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, కేంద్ర కమిటీ నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, ఆల్బర్ట్, గోపు కుమారస్వామి, చిలక రాజయ్య, భీముడు, క్రాంతికుమార్, బాలాజీ, నాగేశ్వరారావు, కోటి పాల్గొన్నారు.



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కార్మికులకు కనీస వేతనాలివ్వండి..



షర్ఫుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల డ్రాఫ్ట్ జీఓలను తక్షణమే సవరించి, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయం తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏఎల్‌సీ) షర్ఫుద్దీన్‌కు గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ... గత జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం 75వ షెడ్యూల్ ప్రకారం పరిశ్రమల్లో పనిచేస్తున్న 1.20 కోట్ల మంది కార్మికులకు ఇచ్చిన కనీస వేతనం డ్రాఫ్ట్ పాతసీసాలో కొత్తసారాలా ఉందన్నారు. కార్మికులకు ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 10 నుంచి 30వ తేదీ వరకు కనీస వేతనం డ్రాఫ్ట్ సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో పెట్రోల్ బంక్, షాప్ ఎంప్లాయీస్, సెక్యూరిటీ సర్వీసెస్, ఆటో మొబైల్స్, ఇంజనీరింగ్, సినిమా ఇండస్ట్రీ తదితర సర్వీసుల్లో పనిచేస్తున్న వ్యక్తుల నుంచి దరఖాస్తులను స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి తమ అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు. స్పందించిన ఆర్‌ఎల్‌సీ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కారం చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల అర్జున్, దొడ్డ రవికుమార్, కే.సత్య తదిత రులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పాల్వంచ: యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.బాలు ప్రవరాఖ్య అన్నారు. గురువారం స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... యువత ఉన్నత లక్ష్యాల దిశగా కృషి చేయాలని తమలోని నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.భరత్ కృష్ణ, డైరెక్టర్ టి.అవని, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న, ఇమ్మడి క్రాంతి కుమార్, నాగేంద్రబాబు, ప్రభాత్, సంధ్య, ప్రశాంత్, వీరస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలు ప్రవరాఖ్య

డాక్టర్ రాకేష్‌కుమార్‌కు సన్మానం



డాక్టర్ రాకేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్రాయింగ్ అండ్ డిపర్సింగ్ ఆఫీసర్ (డీడీఓ), మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రాకేష్ కుమార్ డిస్ట్రిక్ట్ సర్వెలెన్స్ ఆఫీసర్ (డీఎస్ఓ)గా పదోన్నతి పొందారు. పదోన్నతిపై డీఎంహెచ్ఓ కార్యాలయానికి వెళ్తున్న డాక్టర్ రాకేష్ కుమార్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, గోలి సెల్వరాజ్, మిర్యాల కిరణ్ కుమార్, కొమ్మినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

జేపీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇడుపుల రాజు ఆధ్వర్యంలో డాక్టర్ రాకేష్ కుమార్‌కు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజశ్వని, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, శీరంశెట్టి వినోద్, కాకటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు లేక్ వ్యూ పార్క్‌లో 'ఐపీఎల్'

ఇల్లెందు: పట్టణంలోని ఇల్లెందుల పాడు చెరువు కట్ట వద్ద నిర్మించిన లేక్ వ్యూ పార్క్‌లో క్రికెట్ అభిమానులు ఐపీఎల్ క్రికెట్ పోటీలను తిలకించేందుకు పెద్దపెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకించేలా ఏర్పాటు చేశారు. క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు పార్క్‌ను సందర్శించి, ఆహ్లాదం పొందేందుకు ఈ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. టీవీలలో సీరియల్‌లు తిలకించే సమయాన ఇళ్లల్లో క్రికెట్ చూసే అవకాశం ఉండదు. దీంతో క్రికెట్ అభిమానులు, క్రీడాకారులు, ప్రేక్షకులు పార్క్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌ల మీద తిలకిస్తూ ఆనందం పొందాలని ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం రాత్రి మ్యాచ్‌లను తిలకించేందుకు పార్క్‌లో తగు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. యువకులు, పట్టణ ప్రజలు మ్యాచ్‌లు తిలకించాలని, పార్క్‌ను సందర్శించాలని కోరారు.



పార్క్‌లో క్రికెట్ చూస్తున్న అభిమానులు

పట్టణ ప్రకృతి వనాలపై పట్టింపెవరికి?



13వ వార్డులో బృహత్ పట్టణ ప్రకృతి వనం




పార్క్‌లో ఎండిపోతున్న మొక్కలు

- నీళ్లు పట్టరు, పిచ్చి మొక్కలు తొలగించరు
- రూ.లక్షలు వ్యయం చేసినా ఫలితం శూన్యం

ఇల్లెందు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేసిన పార్క్‌ల ఆలనాపాలనా కరువైంది. ఇల్లెందు పట్టణంలో పలుచోట్ల 20 ఎకరాల్లో బృహత్ పట్టణ ప్రకృతి వనం, చిట్టడివి, అర్బన్ పార్క్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఏడాదిగా వాటి మీద పర్యవేక్షణను గాలికి వదిలేశారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఖాళీ స్థలాలను గుర్తించి ఏర్పాటు చేసిన ఈ పార్క్‌లలో మొక్కలకు నీళ్లు లేవు, కంచెలు లేవు, పార్క్‌లలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించడం లేదు. దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

కంచెలు లేక పశువులు, మేకలు తింటున్నాయి. ఇక మొక్కల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి నాటిన మొక్కల ఎదుగుదలను అడ్డుకుంటున్నాయి. నీటి కోసం ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్ పైపులు పార్క్‌లో ఎక్కడివక్కడ చెల్లాచెదురుగా పడిపోయాయి. పార్క్ అవతల వైపున ఖాళీగా ఉన్న గ్రౌండ్‌లోకి క్రీడాకరులు పార్క్ మధ్య నుంచి వచ్చిపోతున్నారు.

పార్క్‌లను పటిష్టం చేస్తాం..



పట్టణంలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్క్‌లు, చిట్టడవెల ఆలనా పాలనా పర్యవేక్షణ పెంచి రక్షణ కల్పిస్తాం. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. నాటిన మొక్కలకు రక్షణ కల్పిస్తాం.

– డీవీ, చైర్మన్, ఇల్లెందు మున్సిపాలిటీ